RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 253 | సంపుటి 4 | శనివారం | 06-06-2026 | పేజీలు 4 | వెల 3/-

## 30 నెలల కాంగ్రెస్ పాలనపై
# బహిరంగ చర్చకు సిద్ధం



తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు బహిరంగ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ 30 నెలల పాలనపై ప్రజల సమక్షంలో ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. పాలమూరు జిల్లా అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సంక్షేమం, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రస్తావిస్తూ, కేసీఆర్ పాలనలో జరిగిన వైఫల్యాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన, పాలమూరు జిల్లాలో ఇకపై బీఆర్ఎస్ కు రాజకీయ భవిష్యత్ లేదని, ఈ గడ్డపై ఆ పార్టీ జెండా ఎగరనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేసిన వారిని రాజకీయంగా ఓడించడమే లక్ష్యమని పేర్కొంటూ, పదేళ్ల పాలనపై చర్చకు రావాలని కేసీఆర్ ను మరోసారి సవాల్ చేశారు.

— హైదరాబాద్, ప్రభాత గమనం

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్
- పాలమూరులో బీఆర్ఎస్ కు రాజకీయ సమాధి కడతాం
- గోదావరి, కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల కోసం పోరాటం
- పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు కీలక హామీలు
- జూరాల వద్ద కొత్త రిజర్వాయర్ నిర్మాణ ప్రకటన
- పాలమూరును దేశానికే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం
- బీఆర్ఎస్ కుటుంబ పాలనపై తీవ్ర విమర్శలు
- "నేను ఓడితే క్షమాపణ చెబుతా" అంటూ కేసీఆర్ కు సవాల్
- 2029లో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే లక్ష్యమన్న రేవంత్ రెడ్డి

2



## మూడు రోజుల పాటు
# భారీ వర్షాలు


- రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్
- ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు
- గంటకు 40-60 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం
- నల్గొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాలకు భారీ వర్ష సూచన
- ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పడిపోయే చాన్స్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన

2

తెలంగాణలో ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన విస్తృత వర్షా లు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేయగా, పలు జిల్లాల్లో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ వర్షా ల ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల మేర తగ్గి, ఉక్కపోత నుంచి ఉపశమనం లభించనుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## 500 మంది పోలీసులతో దాడులు

- మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 113 స్పా సెంటర్లలో తనిఖీలు
- 500 మంది పోలీసులతో ప్రత్యేక ఆపరేషన్
- రికార్డులు నిర్వహించని కేంద్రాల గుర్తింపు
- భవన యజమానులను కూడా విచారించిన పోలీసులు
- అసాంఘిక కార్యకలాపాలపై కేసులు నమోదు
- స్పా నిర్వహణకు కఠిన నిబంధనలు కావాలని ప్రజల విజ్ఞప్తి



3

**హైదరాబాద్, జూన్ 5 (ప్రభాత గమనం):** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం భారీ ఎత్తున నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ స్పా సెంటర్ నిర్వాహకుల్లో కలకలం రేపింది. దాదాపు 500 మంది పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కమిషనరేట్ పరిధిలోని 113 స్పా సెంటర్లపై ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ ఆకస్మిక దాడులతో స్పా సెంటర్ నిర్వాహకులు ఉలిక్కిపడ్డారు. పోలీసుల తనిఖీల్లో పలు స్పా సెంటర్లలో నిబంధనల ఉల్లంఘనలు, అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా కస్టమర్ల వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను నిర్వహించకపోవడం, అవసరమైన అనుమతులు, పత్రాలు సక్రమంగా లేకపోవడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు.

## మిర్యాలగూడలో
# ఘోర విషాదం

3

- షార్ట్ సర్క్యూట్ తో చెలరేగిన మంటలు
- పేలిన గ్యాస్ సిలిండర్.. ముగ్గురు మృతి
- అమ్మమ్మతో పాటు ఇద్దరు చిన్నారుల దుర్మరణం
- ప్రమాదంపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో
# ఎబోలా కలకలం..

- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడికి జ్వరం గుర్తింపు
- ఎయిర్ పోర్టులోనే అప్రమత్తమైన ఆరోగ్య శాఖ
- గాంధీ ఆసుపత్రికి తరలింపు.. ఐసోలేషన్ వార్డులో చికిత్స
- నమూనాలను పరీక్షలకు పంపిన అధికారులు
- నివేదికలు వచ్చే వరకు హై అలర్ట్ లో యంత్రాంగం
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న వైద్యులు

04






2

## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే
# ఏజెన్సీ ప్రజాదర్బార్

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రత్యేక చొరవ
- 119 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్
- మహాదేవునిగూడెంలో ఇప్పపువ్వు లడ్డు తయారీ శిక్షణ కేంద్రం ప్రారంభం
- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలపై మంత్రి హామీ
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటాలని పిలుపు
- ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు సన్మానం

ఏజెన్సీ ప్రాంత ప్రజల సమస్యలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పకుండా గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ప్రజా దర్బార్' కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గంగారం మండలంలో నిర్వహించిన ప్రజా దర్బార్ లో ప్రజల నుంచి నేరుగా 372 వినతులను స్వీకరించిన మంత్రి, గత దర్బార్ లో అందిన దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపికైన 119 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ ను పంపిణీ చేశారు. అదే సమయంలో గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మహాదేవునిగూడెంలో ఏర్పాటు చేసిన ఇప్పపువ్వు లడ్డు తయారీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కారం, మహిళల ఆర్థిక సాధికారత, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని మంత్రి స్పష్టం చేశారు.

—మహబూబాబాద్, ప్రభాత గమనం




## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే

# ఏజెన్సీ ప్రజాదర్బార్

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రత్యేక చొరవ
- 119 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్
- మహాదేవునిగూడెంలో ఇప్పపువ్వు లడ్డు తయారీ శిక్షణ కేంద్రం ప్రారంభం
- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలపై మంత్రి హామీ
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటాలని పిలుపు
- ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులకు సన్మానం

**గంగారం, జూన్ 5 (ప్రభాత గమనం):**

గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి వెంటనే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రజా దర్బార్' కార్యక్రమాలు ఫలితాలిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం గంగారం మండలం మర్రిగూడెం రైతు వేదికలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్‌తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారంపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### 372 దరఖాస్తులు స్వీకరణ

ప్రజా దర్బార్‌లో ప్రజలు వివిధ సమస్యలపై పెద్ద సంఖ్యలో వినతిపత్రాలు సమర్పించారు. గత వారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వచ్చిన 300 దరఖాస్తులను పరిశీలించి, అందులో 119 మంది అర్హులను రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. శుక్రవారం వారికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. నేటి కార్యక్రమంలో మరో 372 దరఖాస్తులు అందాయని, వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### ఇప్పపువ్వుతో ఉపాధి అవకాశాలు

అనంతరం మహాదేవునిగూడెం ఆశ్రమ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గిరిజన కార్పొరేషన్, డీఆర్‌డీఓ, జిల్లా పరిశ్రమల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఇప్పపువ్వు లడ్డు తయారీ శిక్షణ కేంద్రాన్ని' మంత్రి ప్రారంభించారు. ఇప్పపువ్వు ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఇప్పపువ్వుతో లడ్డూలతో పాటు నూనె, పౌడర్ తదితర విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యల నివారణలో కూడా ఇప్పపువ్వు ఉపయోగపడుతుందని తెలిపారు.

### మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం

మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి వివరించారు. స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. ఈ రుణాలపై వడ్డీ భారాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోందని స్పష్టం చేశారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి సీతక్క ప్రత్యేక సందేశం ఇచ్చారు. అడవుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్లను నరకవద్దని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు అడవులకు హాని కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పులుసం ఉదయశ్రీ, కృషికలను మంత్రి ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్, డీఎఫ్ఓ విశాల్ బత్తుల, ఇన్చార్జి అదనపు కలెక్టర్, జడ్పీ సీఈఓ పురుషోత్తం, డిఆర్డిఓ పీడీ మధుసూదన రాజు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ కళ్యాణి, ఆర్డీఓ కృష్ణవేణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశి రామ్ నాయక్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ

# ప్రతి ఒక్కరి బాధ్యత

- హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనమహోత్సవం నిర్వహణ

**హనుమకొండ, జూన్ 05( ప్రభాత గమనం ) :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మరియు చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మూడు రోజుల పాటు భారీ వర్షాలు

- రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్
- ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు
- గంటకు 40-60 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం
- నల్గొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాలకు భారీ వర్ష సూచన
- ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పడిపోయే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అనుకూల వాతావరణ పరిస్థితులు, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. పలు జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వర్షాల తీవ్రత దృష్ట్యా రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

### నేడు ఐదు జిల్లాల్లో భారీ వర్ష సూచన

శుక్రవారం రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అలాగే హైదరాబాద్, జనగామ, వరంగల్, ములుగు, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మంచిర్యాల జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నాయని పేర్కొంది.

### రేపు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు

శనివారం నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది.

### ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్‌లో మోస్తరు వర్షాలు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉండటంతో రైతులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### ఈదురు గాలులతో అప్రమత్తంగా ఉండాలి

పలు జిల్లాల్లో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. చెట్ల కింద నిలబడకూడదని, అవసరమైతేనే ప్రయాణాలు చేయాలని సూచించింది. వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులు కూడా వాతావరణ పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. గత కొన్ని రోజులుగా రాష్ట్రాన్ని వేధిస్తున్న ఉక్కపోత, ఎండల తీవ్రతకు ఈ వర్షాలు కొంత ఉపశమనం కలిగించనున్నాయి. రానున్న నాలుగు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం చల్లబడే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## 30 నెలల కాంగ్రెస్ పాలనపై

# బహిరంగ చర్చకు సిద్ధం

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్
- పాలమూరులో బీఆర్ఎస్ కు రాజకీయ సమాధి కడతాం
- గోదావరి, కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల కోసం పోరాటం
- పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు కీలక హామీలు
- జూరాల వద్ద కొత్త రిజర్వాయర్ నిర్మాణ ప్రకటన
- పాలమూరును దేశానికే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం
- బీఆర్ఎస్ కుటుంబ పాలనపై తీవ్ర విమర్శలు
- "నేను ఓడితే క్షమాపణ చెబుతా" అంటూ కేసీఆర్ కు సవాల్
- 2029లో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే లక్ష్యమన్న రేవంత్ రెడ్డి



**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్), భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 30 నెలల పాలనపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటిస్తూ కేసీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తాను చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, రైతులకు అందించిన ప్రయోజనాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని ఆహ్వానించారు. జడ్చర్ల సమీపంలోని గంగాపూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, పాలమూరు జిల్లా అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, బీఆర్ఎస్ పాలనలో జరిగిన నిర్లక్ష్యం, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు.

### "పాలమూరులో బీఆర్ఎస్ జెండా ఎగరనివ్వం"

పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లేదని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నేలపై ఇకపై బీఆర్ఎస్ జెండా ఎగరనివ్వబోమని, భవిష్యత్తులో ఒక్క అభ్యర్థిని కూడా గెలవనివ్వమని స్పష్టం చేశారు. "గద్దెలు దిగాలి... దిమ్మెలు కూలాలి... పాలమూరు ప్రజలను మోసం చేసిన వారిని రాజకీయంగా ఇంటికి పంపించాలి. ఈ నేలపై కాంగ్రెస్ జెండానే ఎగరాలి" అంటూ సభా వేదికపై శపథం చేశారు.

### "30 నెలల పాలన చెబితే రామాయణం.. రాస్తే భారతం"

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి మాట్లాడుతూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నా 30 నెలల పాలన గురించి మాట్లాడితే అది రామాయణం అవుతుంది... రాస్తే భారతం అవుతుంది. మేము చేసిన పనులు ప్రజల ముందున్నాయి. రైతులకు, మహిళలకు, యువతకు, పేదలకు అందించిన ప్రయోజనాలు అందరికీ తెలుసు. అందుకే కేసీఆర్‌ను బహిరంగ చర్చకు ఆహ్వానిస్తున్నాను" అని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన పనులు, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసిన పనులపై ప్రజల సమక్షంలో చర్చించేందుకు సిద్ధమని చెప్పారు. "ఆ చర్చలో నేను ఓడిపోతే ప్రజలకు క్షమాపణ చెబుతాను. కానీ మీరు ఓడిపోతే తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి" అంటూ సవాల్ విసిరారు.

### కేసీఆర్ కుటుంబ పాలనపై విమర్శలు

బీఆర్ఎస్ పాలనను కుటుంబ పాలనగా అభివర్ణించిన సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ కుటుంబ సభ్యులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్, ఆయన కుమారుడు, మనవడు మాత్రమే రాజ్యాలు ఏలాలట. కానీ రైతు బిడ్డలు, కూలీల పిల్లలు, వృత్తి పనులు చేసుకునే వారి పిల్లలు మాత్రం అదే స్థితిలో ఉండాలట. కాంగ్రెస్ ఆ ఆలోచనను మార్చింది. సామాన్య కుటుంబాల పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశాలు కల్పిస్తోంది" అని అన్నారు.

### పాలమూరును మోసం చేసిన బీఆర్ఎస్

కరీంనగర్ రాజకీయాల నుంచి పాలమూరుకు వచ్చిన కేసీఆర్‌ను ఈ జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకుని గెలిపించారని, కానీ ఆయన పాలమూరుకు న్యాయం చేయలేదని ఆరోపించారు. "కరీంనగర్‌లో రాజకీయ భవిష్యత్‌పై సందేహాలు రావడంతో పాలమూరుకు వచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఆదరించారు. పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించారు. కానీ ఐదేళ్లలో ఐదుసార్లు కూడా పాలమూరుకు రాలేదు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తొచ్చారు" అని విమర్శించారు. "మేక వన్నె పులి అని తెలియక ప్రజలు రెండుసార్లు గెలిపించారు. కానీ ఇప్పుడు నిజం తెలిసింది. అందుకే ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరిస్తున్నారు" అని అన్నారు.

### గోదావరి, కృష్ణా జలాలపై కీలక ప్రకటనలు

రాష్ట్రానికి నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గదని సీఎం స్పష్టం చేశారు. గోదావరి జలాల అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. అవసరమైతే ఒత్తిడి తీసుకువచ్చి అయినా తెలంగాణకు రావాల్సిన నీటిని సాధిస్తామని చెప్పారు. "గోదావరి జలాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం చివరి వరకు పోరాడుతాం. చర్చలు జరిపి అయినా, అవసరమైతే గట్టిగా నిలబడి అయినా రాష్ట్రానికి న్యాయం చేస్తాం" అని పేర్కొన్నారు.

### ప్రాణహిత-చేవెళ్లకు కొత్త ఊపు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. "ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర తెలంగాణతో పాటు పాలమూరు ప్రాంతానికి కూడా పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుంది. రైతుల కలలను సాకారం చేసే దిశగా ముందుకు సాగుతున్నాం" అని పేర్కొన్నారు.

### పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీలు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీల నీటి కేటాయింపుల కోసం అవసరమైన అనుమతులు సాధిస్తామని సీఎం హామీ ఇచ్చారు. డిండి ప్రాజెక్టుకు 20 టీఎంసీల నీటి కేటాయింపులు తీసుకురావడం తన వ్యక్తిగత బాధ్యతగా తీసుకుంటున్నానని తెలిపారు. ఉద్దండాపూర్ వరకు ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని, పాలమూరు సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### జూరాల వద్ద కొత్త రిజర్వాయర్ -సరిహద్దులో బ్యారేజ్

పాలమూరు భవిష్యత్తును మార్చేలా జూరాల వద్ద కొత్త రిజర్వాయర్ నిర్మిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, కర్ణాటక-మక్తల్ సరిహద్దులో బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణానికి చర్యలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు జిల్లాలో సాగునీటి విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు.

### "పాలమూరు దేశానికే ఆదర్శం కావాలి"

పాలమూరు జిల్లాను దేశానికి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. "గతంలో వలసల జిల్లాగా పేరొందిన పాలమూరును అభివృద్ధి జిల్లాగా మార్చుతాం. విద్య, ఉపాధి, పరిశ్రమలు, సాగునీరు, రోడ్లు, సంక్షేమం అన్ని రంగాల్లో ముందంజలో నిలబెడతాం" అని అన్నారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరుతూ "ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్" అంటూ నినాదించారు.

# సూర్యాపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్రిక్తత

- అక్రమ రిజిస్ట్రేషన్ ఆరోపణలతో నిరసన
- భారీ పోలీస్ బందోబస్తు





**సూర్యపేట, జూన్5(ప్రభాత గమనం):**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్ జరుగుతోందంటూ ఆరోపించిన కొందరు వ్యక్తులు దానిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, అక్కడున్న వారితో వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు చర్యలు చేపట్టారు.

**టీఆర్పీ నేత వట్టే జానయ్య యాదవ్ అరెస్టు..**

జిల్లా కేంద్రంలోని వివాదాస్పద 'వజ్ర టౌన్‌షిప్' భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను నిరసిస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగిన టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.అధికార పార్టీ నేతల అండతో జరుగుతున్న అక్రమాలను అడ్డుకునేందుకు ఉదయం 10 గంటల నుండి ఆయన భీకర నిరసన చేపట్టారు. సాయంత్రం పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసే క్రమంలో తోపులాట జరిగింది. రోజంతా ధర్నాలో ఉండటంతో జానయ్య యాదవ్ బీపీ పూర్తిగా పడిపోయి అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు ఆయనను తక్షణమే సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. తన ఎదుగుదలను ఓర్వలేకనే అధికార పక్షం కుట్రపూరితంగా ఈ దాడులు, ఆర్థిక ఇబ్బందులు సృష్టిస్తోందని జానయ్య ఆరోపించారు. స్థానికంగా ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది.

# 500 మంది పోలీసులతో దాడులు

- మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 113 స్పా సెంటర్లలో తనిఖీలు
- 500 మంది పోలీసులతో ప్రత్యేక ఆపరేషన్
- రికార్డులు నిర్వహించని కేంద్రాల గుర్తింపు
- భవన యజమానులను కూడా విచారించిన పోలీసులు
- అసాంఘిక కార్యకలాపాలపై కేసులు నమోదు
- స్పా నిర్వహణకు కఠిన నిబంధనలు కావాలని ప్రజల విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 5 (ప్రభాత గమనం):**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం భారీ ఎత్తున నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ స్పా సెంటర్ నిర్వాహకుల్లో కలకలం రేపింది. దాదాపు 500 మంది పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కమిషనరేట్ పరిధిలోని 113 స్పా సెంటర్లపై ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ ఆకస్మిక దాడులతో స్పా సెంటర్ నిర్వాహకులు ఉలిక్కిపడ్డారు. పోలీసుల తనిఖీల్లో పలు స్పా సెంటర్లలో నిబంధనల ఉల్లంఘనలు, అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా కస్టమర్ల వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను నిర్వహించకపోవడం, అవసరమైన అనుమతులు, పత్రాలు సక్రమంగా లేకపోవడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు.

**అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి**

ఇటీవలి కాలంలో నగరంలోని కొన్ని స్పా సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ పోలీసులకు వరుస ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ మెగా తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా అనుమానిత కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు, ఒకేసారి విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించారు.

**ఓనర్ల బాధ్యతలపై ప్రశ్నలు**

స్పా సెంటర్లకు భవనాలను అద్దెకు ఇచ్చిన యజమానులను కూడా పోలీసులు విచారించారు. అద్దె వసూలు చేయడం తప్ప, తమ భవనాల్లో ఏ కార్యకలాపాలు జరుగుతున్నాయనే విషయాన్ని చాలా మంది యజమానులు పట్టించుకోవడం లేదని విచారణలో తేలినట్లు సమాచారం. కొన్ని చోట్ల అక్రమాలపై సమాచారం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులకు తెలియజేయలేదని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

**కేసులు నమోదు.. దర్యాప్తు ప్రారంభం**

తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అవసరమైన అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు హెచ్చరించారు.

**ఇదే తొలిసారి భారీ స్థాయి ఆపరేషన్**

నగరంలో స్పా సెంటర్లపై పోలీసులు గతంలో కూడా తనిఖీలు నిర్వహించినప్పటికీ, ఒకేసారి 500 మంది సిబ్బందితో 113 కేంద్రాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ చర్యతో స్పా రంగంలో నిబంధనల అమలుపై తీవ్ర చర్చ జరుగుతోంది. స్పా సెంటర్ల నిర్వహణకు సంబంధించి మరింత కఠినమైన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు పోలీస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇటువంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు.

# మిర్యాలగూడలో ఘోర విషాదం

- షార్ట్ సర్క్యూట్ తో చెలరేగిన మంటలు
- పేలిన గ్యాస్ సిలిండర్.. ముగ్గురు మృతి
- అమ్మమ్మతో పాటు ఇద్దరు చిన్నారుల దుర్మరణం
- ప్రమాదంపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం

**మిర్యాలగూడ, జూన్ 5 (ప్రభాత గమనం):**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కలాల్వాడలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగి, అనంతరం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంట్లో నిద్రిస్తున్న అమ్మమ్మ వనం చంద్రకళ (50), మనవడు లక్ష్మణ్, మనవరాలు ప్రణతి సజీవదహనమయ్యారు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, సిలిండర్ పేలుడు కారణంగా మంటలు మరింత ఉద్ధృతమయ్యాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. నెల రోజుల క్రితమే భర్తను కోల్పోయిన చంద్రకళ, ఉపాధి కోసం పుణెకు వెళ్లిన తన కుమార్తె పిల్లలను చూసుకుంటూ జీవిస్తోంది. నాలుగు రోజుల క్రితమే కుమార్తె తిరిగి పుణెకు వెళ్లగా, ఈ దారుణ ఘటన చోటుచేసుకోవడం కుటుంబాన్ని విషాదంలో ముంచెత్తింది.

# రాహుల్ కుటుంబానికి న్యాయం చేయాలి

- రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్ ని ఆశ్రయించిన బాధిత కుటుంబ సభ్యులు

**మహబూబాబాద్, జూన్ 5 (ప్రభాత గమనం):**

ఇటీవల భువనగిరి పరిధిలో జరిగిన అనుమానాస్పద రోడ్డు ప్రమాదంలో ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువకుడు రాహుల్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు న్యాయం కోసం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే మురళీ నాయక్ ని కలిసి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ఘటన అనంతర పరిణామాలను వారి దృష్టికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు, కేసుపై నిష్పక్షపాత విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఆవేదనను ఆలకించిన వేం నరేందర్ రెడ్డి ,ఎంపీ బలరాం నాయక్ ,ఎమ్మెల్యే మురళీ నాయక్ లు వెంటనే స్పందించి, సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు,డిసిపి ఎస్పీ స్థాయి అధికారులతో మాట్లాడి కేసు పురోగతిపై ఆరా తీస్తామని తెలిపారు. అలాగే ఘటనపై సమగ్ర విచారణ జరిగి బాధిత కుటుంబానికి న్యాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టిలో ఉంచుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






# సీపీఎంకు షాక్

- సీపీఐలో చేరిన గార్ల మండల కీలక నేతలు!
- కండువాలు కప్పి ఆహ్వానించిన కూనంనేని సాంబశివరావు
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారీ చేరికలు

**గార్ల, జూన్ 5 (ప్రభాత గమనం) :**

మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారాయి. మండలంలో సీపీఎం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు సీపీఎంను వీడి, సీపీఐ పార్టీలో చేరారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో... సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి విజయసారథి రెడ్డి సమక్షంలో నాయకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కూనంనేని సాంబశివరావు వారికి ఎర్రకండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూ, వారి హక్కులను కాపాడటమే సీపీఐ ధ్యేయమని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన నాయకులకు తగిన ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు.గార్ల మండలంలో బలమైన క్యాడర్ ఉన్న సీపీఎం కీలక నాయకులు పార్టీ మారడం విశేషం.మేదరమెట్ల గురుప్రసాద్ (సీపీఎం మాజీ మండల కార్యదర్శి), భూక్య హరి (సీపీఎం జిల్లా కమిటీ మెంబర్), అన్నం శ్రీనివాస్ (రాంపురం మాజీ ఉపసర్పంచ్), భూక్యా పుల్సింగ్ (సీపీఎం శేరిపురం శాఖ కార్యదర్శి), ధారావత్ లక్ష్మి (ఐద్వా మండల నాయకురాలు), భూక్యా పద్మ (ఐద్వా మండల నాయకురాలు), భూక్యా మంగీలాల్ (గిరిజన సంఘం నాయకుడు), బానోతు వెంకన్న, భూక్యా శ్రీను, వంకుడోత్ సొమ్లు తదితరులు ఉన్నారు. ఈ భారీ చేరికలతో గార్ల మండలంలో సీపీఐ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, సీపీఎంకు గట్టి నష్టం వాటిల్లిందనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

## ఇచ్చిన మాట తప్పడం

# ప్రజాస్వామ్యంలో నమ్మకద్రోహమే

- వరుసగా రెండేళ్లుగా జూన్ 2 హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం
- 'రాజీవ్ యువ వికాసం' లేదు.. కొత్త పెన్షన్ల ఊసే లేదు
- వృద్ధులు, వికలాంగుల ఆత్మగౌరవంతో ఆటలాడొద్దు
- మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ ధ్వజం



**గార్ల, జూన్ 5:(ప్రభాత గమనం)**

ఒక ప్రభుత్వానికి అత్యంత విలువైన ఆస్తి ప్రజల నమ్మకమని, కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరుసగా రెండేళ్లపాటు రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) సాక్షిగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను వంచిస్తోందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన గార్లలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.రాజీవ్ యువ వికాసం' కింద నిరుద్యోగులకు ₹4 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని గతేడాది ఆశలు రేపి, తీరా చూస్తే నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడ్డారు.గతేడాది తప్పును సరిదిద్దుకోకపోగా, ఈ ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున "అర్హులైన పెన్షన్ దారులందరికీ పెన్షన్లు ఇస్తాం" అని సరికొత్త ప్రకటన చేశారని గుర్తుచేశారు."మైకుల ముందు హామీలు ఇచ్చి మూడు రోజులు దాటినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కానీ, నిధుల విడుదల కానీ, కార్యాచరణ కానీ లేదు" అని రమేష్ విమర్శించారు. ఇది ముమ్మాటికి వృద్ధులను, అనాథలను, వికలాంగులను మరియు ప్రజా బాహుళ్యాన్ని మోసం చేయడమేనని ఆయన ఆరోపించారు. "సింహాసనంపై కూర్చున్నవాడు మాట తప్పితే, అది కేవలం ఒక అబద్ధం కాదు... ఒక తరం నమ్మకాన్ని ఖూనీ చేయడం. పాలకులు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి."పెన్షన్ అనేది ప్రభుత్వాలు ఇచ్చే 'భిక్ష' కాదని, అది ఈ రాష్ట్ర పౌరుల 'హక్కు' అని ఆయన స్పష్టం చేశారు. వృద్ధాప్యంలో కొడుకు కోడలు సరిగ్గా చూసుకోకపోయినా, "ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఉంది కదా" అనే ధీమాతో బతికే అవ్వాతాతల ఆత్మగౌరవంతో ఆటలాడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. జూన్ 2 నాడు మైకుల ముందు ఊదరగొట్టిన నాయకులు, జూన్ 5 వచ్చినా ఎందుకు పెదవి విప్పడం లేదని ప్రశ్నించారు."గోడకు కొట్టిన బంతి ఎంత వేగంగా తిరిగి వస్తుందో... ప్రజలకు చేసిన మోసం కూడా అంతే వేగంగా పాలకుల వైపు తిరగబడుతుంది" అని ఆయన హెచ్చరించారు.ఐదేళ్లపాటు తమను కంటికి రెప్పలా కాపాడతారని ప్రజలు పాలకులను ఎన్నుకుంటారని, కానీ పవిత్రమైన రాష్ట్ర అవతరణ వేదికలపై నుంచి అబద్ధపు హామీలు గుప్పించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాటకాలకు స్వస్తి చెప్పి, 'రాజీవ్ యువ వికాసం' నిధులు మరియు వృద్ధుల, అర్హులైన అందరి పెన్షన్లను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే, ప్రజల ఆగ్రహ జ్వాలల్లో పాలక పక్ష కుర్చీలు కాలిపోవడం ఖాయమని రమేష్ హెచ్చరించారు.

# గార్లలో 'చేరికల' రాజకీయం

- సీపీఐ ప్రచారంలో నిజం లేదు : సీపీఎం కౌంటర్!
- చేరిన వారిలో ఒక్కరికే సభ్యత్వం..
- మిగతా వాళ్లకు పార్టీతో సంబంధమే లేదు
- ఆధారాలు లేని ప్రచారాలను నమ్మొద్దు : సీపీఎం నేతలు శ్రీనివాస్, సత్యవతి

**గార్ల జూన్ 5 (ప్రభాత గమనం) :**

రాజకీయాల్లో చేరికల జోరు పెంచే క్రమంలో ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ప్రచారాలపై సీపీఎం శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. గార్లలో సీపీఎం నుంచి సీపీఐలోకి భారీగా చేరికలు జరిగాయంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా ఒక మైండ్ గేమ్ అని సీపీఎం తేల్చిచెప్పింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేస్తూ.. సీపీఐ వైఖరిని తీవ్రంగా ఆక్షేపించారు.సీపీఐ పార్టీలో చేరినట్లు చెప్పుకుంటున్న వారిలో ఒక్కరికి మినహా, మిగిలిన ఎవ్వరికీ సీపీఎం పార్టీతో అసలు ప్రాథమిక సభ్యత్వమే లేదని వారు స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పార్టీతో సంబంధం లేని వ్యక్తులను సీపీఎం కార్యకర్తలుగా చిత్రీకరించడం విడ్డూరంగా ఉందన్నారు.సీపీఐలో చేరిన వారిలో ఒక వ్యక్తికి గత మూడేళ్లుగా సీపీఎం పార్టీతో ఎలాంటి సంబంధం లేదు, కనీసం సభ్యత్వం కూడా పునరుద్ధరించుకోలేదు.ఇక మరో వ్యక్తి కేవలం అగ్రిలరీ (అనుబంధ) శాఖకు మాత్రమే పరిమితమయ్యారు తప్ప, ఆయనకు సీపీఎం పార్టీలో ప్రాథమిక సభ్యత్వం కూడా లేదు.ఇలాంటి తప్పుడు ప్రచారాలు చూసి సీపీఎం నాయకులు, క్షేత్రస్థాయి శ్రేణులు ఎవరూ గందరగోళానికి గురికావద్దని శ్రీనివాస్, సత్యవతి కోరారు. పార్టీ కేడర్ పటిష్టంగా ఉందని, రాజకీయ ఉనికి కోసం ఇతర పార్టీలు చేసే అవాస్తవ ప్రకటనలను నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

# ఏసీబీ వలలో మండల సర్వేయర్

- రూ. 25 వేల లంచం డిమాండ్ కేసులో ముగ్గురు అరెస్టు
- భూమి సర్వే కోసం ఫిర్యాదుదారుడి నుంచి లంచం డిమాండ్

**కరీంనగర్ జూన్ 5(ప్రభాత గమనం):**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల సర్వేయర్ ఎక్కలదేవి కుమారస్వామి, ఆయనకు ప్రైవేట్ అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్న తీగల రాజేష్, వంగా విహిత్ రెడ్డిలను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అమ్మంగుర్తి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడి భూమికి సర్వే నిర్వహించి అధికారిక అనుకూలత కల్పించేందుకు మండల సర్వేయర్ కుమారస్వామి రూ.25,000 లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో 2026 మే 23న రూ.5,000ను యూపీఐ ద్వారా స్వీకరించినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం జూన్ 2న మరో రూ.10,000ను నగదు రూపంలో తన ప్రైవేట్ అసిస్టెంట్ వంగా విహిత్ రెడ్డి ద్వారా తీసుకున్నాడు. మిగిలిన రూ.10,000 లంచం మొత్తాన్ని జూన్ 5న మరో ప్రైవేట్ అసిస్టెంట్ తీగల రాజేష్ ద్వారా స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ కరీంనగర్ రేంజ్ అధికారులు ఉచ్చుపన్ని పట్టుకున్నారు. తీగల రాజేష్ వద్ద నుంచి రూ.10,000 లంచం నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను నిర్వర్తించేందుకు లంచం డిమాండ్ చేసి స్వీకరించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగి తన విధులను అక్రమంగా, అవినీతిపరంగా నిర్వహించినట్లు ఏసీబీ పేర్కొంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మండల సర్వేయర్ ఎక్కలదేవి కుమారస్వామితో పాటు తీగల రాజేష్, వంగా విహిత్ రెడ్డిలను అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ వెల్లడించింది.

**లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్‌లో తెలంగాణ ఏసీబీ, ఎక్స్ (ట్విటర్)లో @తెలంగాణ ఏసీబీ ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. ఫిర్యాదుదారుల పేరు, వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా కలకలం..

- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడికి జ్వరం గుర్తింపు
- ఎయిర్ పోర్టులోనే అప్రమత్తమైన ఆరోగ్య శాఖ
- గాంధీ ఆసుపత్రికి తరలింపు.. ఐసోలేషన్ వార్డులో చికిత్స
- నమూనాలను పరీక్షలకు పంపిన అధికారులు
- నివేదికలు వచ్చే వరకు హై అలర్ట్ లో యంత్రాంగం
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న వైద్యులు



**హైదరాబాద్, జూన్ 5 (ప్రభాత గమనం):**

శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఎబోలా వైరస్ అనుమానిత లక్షణాలతో ఓ విదేశీ ప్రయాణికుడు గుర్తించబడటంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. సూడాన్‌కు చెందిన 35 ఏళ్ల మొహమ్మద్ అనే వ్యక్తి విమానాశ్రయానికి చేరుకోగా, థర్మల్ స్కానింగ్‌లో జ్వరం ఉన్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే ప్రత్యేక ప్రోటోకాల్ అమలు చేశారు. ప్రయాణికుడిని ప్రత్యేక అంబులెన్స్‌లో గాంధీ హాస్పిటల్ లోని ఐసోలేషన్ వార్డుకు తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. రక్తం, మూత్రం, స్వాబ్ నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపినట్లు అధికారులు తెలిపారు. నివేదికలు వచ్చిన తర్వాతే ఎబోలా వైరస్ నిర్ధారణపై స్పష్టత వస్తుందని వైద్యులు పేర్కొన్నారు. వైద్యుల సమాచారం ప్రకారం ప్రస్తుతం ప్రయాణికుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఆసుపత్రిలో చేరిన తర్వాత జ్వరం లేదా ఇతర తీవ్రమైన లక్షణాలు కనిపించలేదని తెలిపారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే విమానాశ్రయాల్లో నిఘాను పెంచింది. అంతర్జాతీయ ప్రయాణికులందరికీ థర్మల్ స్క్రీనింగ్ నిర్వహిస్తూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది.



# అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసులు
- జిల్లాలో గంజాయి వినియోగంపై కఠిన నిఘా

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లాలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణలో భాగంగా, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, రూరల్ సీఐ అంజలి, 7 మంది ఎస్ఐలు, 40 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ మైదానాలు, చెట్ల పొదలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, పార్కులు, విద్యాసంస్థల సమీప ప్రాంతాలు, యువకులు గుమిగూడే ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి వినియోగంపై ఆరా తీశారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 25 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అనుమానాస్పద 15 మంది వ్యక్తులకు గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, మాట్లాడుతూ, గంజాయి విక్రయదారులు, సరఫరాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. గంజాయి యువత భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక దురాచారమని, జిల్లాను పూర్తిగా గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు, అలాగే గంజాయి అలవాటుతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ 8712656999కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.



# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

**మహబూబాబాద్, జూన్ 5(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ టౌన్ పీఎస్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను సీఇఐఆర్ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితునికి అప్పగించినట్లు మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపారు. పోగొట్టుకున్న లేదా చోరికి గురైన మొబైల్ ఫోన్లను బాధితులు వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. మొబైల్ రికవరీ టెక్నికల్ సిబ్బంది పిసి సురేందర్, మరియు డబ్లూపిసి భవానిలను సిఐ ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ గడ్డం ఉమా పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సీపీ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి పండ్ల మొక్కలను నాటారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతుండటం, వాహనాలు మరియు పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ అసమతుల్యత ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. పచ్చదనం తగ్గిపోవడమే ఈ పరిస్థితులకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చిన ఆయన, విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు నర్సింహారావు, నాగయ్య, అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ సౌభాగ్యకు ఎస్పీ అభినందనలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హర్యానా రాష్ట్రంలో నిర్వహించిన 3వ ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ (వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా) 2026-2027 పోటీలలో మహబూబాబాద్ జిల్లా షీటీమ్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ బి. సౌభాగ్య పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ సౌభాగ్య శనివారం మహబూబాబాద్ ఎస్పీ డా. శబరీష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పతకం సాధించిన సౌభాగ్యను ఎస్పీ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# బాధిత కుటుంబానికి ఎంపీ వేం పరామర్శ

**కేసముద్రం, జూన్ 5(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సోదరుడు ప్రభాకర్ రెడ్డి ఇటీవలె మృతి చెందా రు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, స్థానిక ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళి నాయక్ లు పరామర్శించి ప్రభాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభాకర్ రెడ్డి మరణం కలచివేసిందన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భరత్ చందర్ రెడ్డి,అల్లం నాగేశ్వరరావు,బండారు వెంకన్న, నీలం దుర్గష్,కదిర సురేందర్, సమ్మిగౌడ్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# పెద్ద వంగర మండలానికి గంజాయి టెస్టింగ్ కిట్లు

**తొర్రూర్ జూన్ 5(ప్రభాత గమనం):**

పెద్ద వంగర మండలాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చడానికి మహబూబాబాద్ ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు గంజాయి సంబంధిత యూరిన్ టెస్టింగ్ కిట్లు పెద్ద వంగర పోలీస్ స్టేషన్ కు చేరుకున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలో ఎవరైనా గంజాయికి బానిసైనట్లు సమాచారం ఉంటే, పెద్ద వంగర పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇస్తే, వెంటనే వారికి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ చేసి, రిపోర్టు తీసుకొని గంజాయి సేవించిన వారిపై గంజాయి అందించిన వారిపై చర్య తీసుకోనున్నట్లు పెద్దవంగర ఎస్సై తెలిపారు. గంజాయి రహిత మండలంగా మార్చడానికి అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సమాచారం తెలిసిన వెంటనే డయల్ చేయాల్సిన ఫోన్ నెంబర్లు 8712656978(ఎస్ఐ పెద్దవంగర), 8712656979(పిఎస్ పెద్దవంగర)




# ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

- అక్రమ ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి
- పుస్తకాలు అమ్ముతున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి
- డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి సూర్య ప్రకాష్
- విద్యాశాఖ జిల్లా సూపరింటెండెంట్ కె.జ్యోతికి వినతి పత్రం అందజేత

**మహబూబాబాద్ జూన్ 5(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లాలో విద్యాహక్కు చట్టాన్ని ఆర్టిఈ బేఖాతరు చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తూ, ఈ మేరకు డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయి కుమార్, కోశాధికారి గూగులోతు సూర్య ప్రకాష్ శుక్రవారం జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ కె. జ్యోతి ని కలిసి ఒక సమగ్రమైన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా డిఎస్ఎఫ్ఐ ప్రతినిధులు మాట్లాడుతూ..జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి వ్యాపార కేంద్రాలుగా మారాయని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను అస్సలు పట్టించుకోకుండా, తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వేల రూపాయల ఫీజులను అక్రమంగా వసూలు చేస్తున్నారు అని అన్నారు. ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు, కనీస వసతులు లేని స్కూళ్లను యథేచ్ఛగా నడుపుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు అని తెలిపారు.విద్యాశాఖ నుంచి ఒక పేరుతో, ఒక ప్రాంతంలో అనుమతి పొంది దానికి భిన్నంగా వేరే పేరుతో, ఇతర ప్రాంతాలలో బ్రాంచ్‌లను నడుపుతూ మోసాలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు.కేవలం స్టేట్ బోర్డ్ అనుమతి మాత్రమే పెట్టుకొని, విలాసవంతమైన బోర్డులు తగిలించి, "సిబిఎస్ఈ సిలబస్" చెప్తున్నామనే నెపంతో లక్షలాది రూపాయల ఫీజులు గుంజుతున్నారు.పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు చేస్తూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్ ఆవరణలో ఎలాంటి వ్యాపారాలు చేయకూడదు అని చట్టం చెప్తున్న కానీ, మార్కెట్ ధరల కంటే రెట్టింపు ధరలకు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, బెల్టులను స్కూళ్లలోనే విక్రయిస్తూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారు అని అన్నారు. కావున "విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాల వైఖరిపై తూతూమంత్రంగా వ్యవహరించకుండా, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలి." అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం డిఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు రెండ్ల సంతోష్,విఘ్నేష్, గౌతమ్,అరుణ్,వినయ్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నివీర్‌కు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

**నెల్లికుదురు జూన్ 5(ప్రభాత గమనం):**

నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆశోద ప్రశాంత్, గుండెపాక గణేష్ భారత సైన్యంలో ప్రతిష్టాత్మకమైన అగ్నివీర్ నియామకాలకు ఎంపిక కావడంపై కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎన్.స.స జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల నిరంతర శ్రమతో ఈ విజయాన్ని సాధించారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరని వారు నిరూపించారని అన్నారు. దేశ సేవకు అంకితమయ్యే అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కళాశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. వెంకటేశ్వర్లు అధ్యాపకులు ప్రకాష్ బాబు, కవిరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సుధాకర్, మహేందర్, బాబు, సతీష్, యాకన్న, సుభాష్ అధ్యాపకేతర బృందం శ్రావణ్, ప్రదీప్, లక్ష్మణ్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374